


# స్వప్నకిరీటం

## -కొంపెల్ల విశ్వం

అధునాతనమైన ఓ లగ్జరీ బస్సు సనాతనమైన ఓ ఊర్లో కొచ్చి ఆగింది. అలాంటి అందమైన బస్సు ఓం ప్రథమంగా అప్పుడే ఆ వూర్లోకి వచ్చింది కాబట్టి పిల్లా పాపా అంతా పరిగెట్టుకొచ్చారు - ఆ బస్సుని, అందులోంచి దిగుతున్న జనాన్ని చూడటానికి.

బస్సులోంచి దాదాపు ముప్ఫయిమంది దిగారు. అందరూ పాతికేళ్ళ లోపు యువతీ యువకులే. అందంగా, ఆకర్షణీయంగా, ఫేషన్స్‌కు ప్రతిరూపంగా వున్న వారే, పిల్లలందరూ కళ్లప్పగించి వాళ్ళనే చూస్తూ వుండిపోయారు.

"ఏమండీ!" అన్నాడు ఓ వలాకీ కుర్రాడు. నిక్కరు మీద ఫుల్‌హేండ్ షర్టు తొడుక్కున్నాడు వాడు. పదేళ్లకన్నా వుండవు.

'ఏమిటన్నట్టు చూసింది ఆ అందాల భరిణె. బెంగాల్ కాటన్ చీర బలే అందంగా కుట్టుకుందామె. ఇరవై ఏళ్ళకుమించి వుండమన్నా వుండవు.

"మిమ్మల్నోసారి ముట్టుకోవచ్చా"

"ఎందుకు"

"ముట్టుకుంటే మీరు కందిపోతారో లేదో చూద్దామని"

తనే వాణ్ణే ముట్టుకుని, వాడి తల నిమిరింది. మిగిలిన పిల్లలందరూ వాణ్ని హేళన చేసి చూశారు.

"మరేమోనేం, మేం అందరం ఈ బస్సులోకెక్కి ఆడుకోమా!?" అర్జీ పెట్టాడు వాడు.

"బస్సును పాడు చేయకుండా ఆడు కుంటారా మరి!" అడిగిందామె.

"ఓ"! - అన్నది ఆ కుర్రాడు కాదు, మిగిలిన పిల్లలు. ఇక ఆ అమ్మాయిని పట్టించుకోకుండా బస్సులోకెళ్ళిపోయారు పిల్లలు.

"ఏమిటే, అప్పుడే పిల్లల్ని మచ్చిక చేసేసుకున్నావ్?" అడిగాడు ప్రతాప్. ఆమె కోసం నిరీక్షిస్తూ. మిగతా వాళ్ళంతా వూర్లోకి వెళ్ళిపోయారు.

"నా కోసమే నా ఈ నిరీక్షణ" అతనికి సమాధానం చెప్పకుండా అడిగింది నిరీక్షణ.

"ఆ పేరు పెట్టుకుని మరీ నా ప్రాణం తీస్తున్నావ్" అన్నాడు ప్రతాప్.

"ఇంతేనన్నమాట నీ ప్రతాపం" దెప్పి పొడిచింది నిరీక్షణ. మాటలు చెప్పుకుంటూ వెళ్ళి మిగతా జనాన్ని కలిశారు.

"వచ్చిన పని మర్చిపోతే ఎలా?" అన్నాడు యశ్వంత్ వాళ్లను చూసి.

వాళ్ళంతా హేతువాదులు. శాస్త్రీయమైన దాన్ని తప్ప వాళ్ళు దేన్నీ నమ్మరు. దేవుడు అశాస్త్రీయం కాబట్టి ఆయనొచ్చినా నమ్మరు. వాళ్ళ సిద్ధాం తాలు ప్రచారం చేయడానికి, మనుషుల్ని మూర్ఖత్వంలోంచి బైట పడేసి అభ్యుదయ మార్గంలో పయనింపచేయ డానికి వాళ్ళు ఆ వూరొచ్చారు. గ్రామాలు దేశానికి వెన్నెముక కాబట్టి గ్రామాల్లోంచే దేశాభ్యుదయం సాధించాలి కాబట్టి ముందుగా ఆ వూరు నుంచి తమ ఆశయ సాధన చేయాలని వచ్చారు. ఆ వేసవిని అలా సద్వినియోగం చేయదల్చుకున్నారు.


దేవుడు అనేది ఎంత అబద్ధమో, భ్రమో - ఆ భ్రమలో మనుషులు ఎలా బ్రతుకుతున్నారో అదంతా ఎంత నిష్ప్రయోజనమైన వ్యవహారమో ఉపన్యసించి, నచ్చ చెప్పడానికి ప్రయత్నించింది ఆ బృందం. అప్పటికి మధ్యాహ్నం రెండయింది. కడుపులో ఆకలి కరకరమంటోంది. సమావేశం చాలించి భోజన హోటల్‌కెళ్ళారు వాళ్ళు.

టేబిల్స్ వద్ద కూర్చున్నారు. ఆ పరిసరాలు చాలా అశుభ్రంగా వున్నాయి.

"మోస్ట్ అన్‌హైజీనిక్" అంది నిరీక్షణ.

"ఏదో ఒకటి" ఇవ్వడవన్నీ చూసుకుంటే ఇక్కడ పట్టెడు మెతుకులు కూడా దొరకవు" అన్నాడు ప్రతాప్.

"ముప్ఫయి మందికి భోజనం" అన్నాడు యశ్వంత్ హోటల్ యజమానిని ఉద్దేశించి.




"లేదు" అన్నాడు యజమాని వాళ్ళందర్నీ చూస్తూ.

"లేకపోతే వండించండి. కాసేపు కూర్చుంటాం"

"బాబూ, మీరోసారి ఇలా వచ్చి బైట వున్న బోర్డు చూస్తారా?"

"ఎందుకు"

"చూడండి చెబుతాను"

చూశారు యశ్వంత్, ప్రతాప్ బోర్డే కాదు. మొహమొహాలు కూడా చూసుకున్నారు.

"శ్రీ వెంకటేశ్వర మెస్" - అది మా హోటల్ పేరు. కలియుగదైవం తిరుపతి వెంకటేశ్వర స్వామి పేరే మా హోటల్‌కి పెట్టుకున్నాం. మీరంతా నాస్తికులు. మీకేమో దేవుడు లేడు. ఆయన లేనపుడు ఆయన పేరు మీదున్న హోటల్‌లో మీకు భోజనం మాత్రం ఎందుకు చెప్పండి. వెళ్ళి రండి బాబూ!" అన్నాడు హోటల్ యజమాని నిర్మొహమాటంగా, నిష్కారంగా.

"అది కాదండి..." ఏదో చెప్పబోయాడు యశ్వంత్.

"ఇక్కడ భోజనం దొరకదండి, ఇంకో చోటు వెతుక్కోండి" చెప్పేసి తన పనిలో పడిపోయాడు యజమాని.

"హోటల్స్ ముందు అంటురోగులు లోపలకు రాకూడదనే బోర్డులు చూశాం గానీ హేతు వాదులకు తిండిపెట్టం అనే మనిషిని ఇతన్నే చూశాం" అంది నిరీక్షణ బైటకొచ్చి. అతనే కాదు, మరో హోటల్ వాళ్ళూ భోజనం పెట్టలేదు- అది 'శ్రీరామ భోజన హోటల్' సత్యనారాయణ కాఫీ క్లబ్ టిఫిన్, కాఫీ కూడా ఇవ్వనని మొరాయించింది. సిగరెట్లు, వక్కపొడి కూడా దొరకలేదు వాళ్ళకు.

'ఈ వూర్లో ఏమిటో పీడ, అన్నీ దేవుడి పేర్లే' విసుక్కున్నాడు ప్రతాప్. ప్రచారం సంగతి సరే, ముందు మన ఆకలి సంగతేమిటి అనే ఆలోచన్లోనే వున్నారు అందరూ. ప్రతాప్‌తో బాటు వచ్చిన అతని న్యాయవాద మిత్రులు, యశ్వంత్‌తో వచ్చిన ఇంజనీర్లు, నిరీక్షణతో వచ్చిన మెడికోలు - అందరికీ ఒకటే ఆలోచన - దేవుడు లేడని చెప్పడం ఎలాగని కాదు, ఆకలి తప్పించుకోవడం ఎలా అని.

* * *

అందరూ ఊరి చివర ఓ పాడు బడిన కొంప వుంటే అక్కడకు చేరి కూర్చున్నారు. కొంతమంది పట్టుగా, గంభీరంగా వున్నారు కాని వలుగు రైదుగురైతే మరీ నీరసపడి పోయారు. చిన్నపిల్లలకన్నా కనాకష్టంగా ఆకలి అని గోల చేస్తున్నారు. వాళ్ళని విసుక్కున్నాడు యశ్వంత్

"ఒక్కరోజు ఆకలికి తట్టుకోలేకపోతే ఎలా?"

"అందరూ మొండి మనుషులేన్నున్న ఈ వూర్లో రేపు మాత్రం మనకేం దొరుకుతుంది? సిద్ధాంతాలూ వద్దు, రాద్ధాంతాలు వద్దు - అర్జెంటుగా ఈ ఘూరొదలి పోదాం పదండి"

అంటూ కంగారు పడి పోయాడు బలరామ్. యశ్వంత్



# కాల్చేసే వడగళ్ళు

ఎప్పటికప్పుడు అనుకుంటూ
ఈ ప్రపంచమే వల్మీకమని
ఇప్పటికిప్పుడు అనుకున్నా
ఇది అనంత ఫణులకు నిలయమని

ప్రతి చెట్టూ తన పచ్చదనంతో
ప్రాణుల కభయం అనుకున్నాను
కొమ్మకొమ్మలో కోరలు విప్పిన
క్రూరమృగముల కనుగొన్నాను

ప్రతి మొక్కా ఇల తల ఊపే ఒక
ప్రణయ కావ్య మనుకున్నాను
ఆకు ఆకునా హాలాహలమ్ము
నిండి ఉండుటను కనుగొన్నాను

వసంత ఋతువున వనసీమలలో
వెన్నెల ఝరులని అనుకున్నాను

నిశాంత విషాంత తరగల దాల్చిన
నీలి సంద్రమును కనుగొన్నాను

మానవత్వమొక మధుర భావిమై
మంచిని పెంచును అనుకున్నాను
మనిషి మనిషిలో మంటలు రేపిన
మారణహోమం కనుగొన్నాను

రాజకీయ మొక రమ్యభావనై
రాజ్యములేలును అనుకున్నాను
రంగులు మార్చే ఊసరవెల్లుల
రావణ రాజ్యం కనుగొన్నాను

మెడలో ఉన్నవి పూలమాలలే
మెదడున మాత్రం ఘోర విషం
వంకర నవ్వుల పెదవి చాటున
అగ్నిమండుటను కనుగొన్నాను —

కె. వరలక్ష్మి

ఏమనేవాడో యేమో, కాని హుందాగా గంభీరంగా వున్న అరవై ఏళ్ళ ఆసామీ తమవైపే నడిచి వస్తూ వుండడంతో మాటలు మాని అందరూ ఆయనవైపే చూడసాగారు. వారి చెవులు నిశ్శబ్దం చేయడం భరించ లేక పోతున్నాయి. అందుకే ఆసామీ చేతిలోని వెండి పొన్ను కర్ర శబ్దం చేస్తూ దగ్గరవుతూ వుంటే ఆలకిస్తున్నాయి.

ఆయన వారికి దగ్గరకు వచ్చాడు. వారిని తేరిపార చూశాడు. వాళ్ళు ఆయన్ని పరిశీలనగా చూశారు.

"నాపేరు వెంకట్రామయ్య, మీ పేర్లు తెలుసుకోవచ్చా" అంటూ అడిగి తెలుసుకున్నాడు.

"మీరంతా ఏపని మీద వచ్చారో నాకు తెలుసు. మీకు అభ్యంతరం లేకపోతే మాయింటికెడదాం పదండి" అంటూ వాళ్ళ సమాధానం కోసం చూడకుండా ముందుకు నడిచాడాయన. ఆయన్ని అనుసరించారు వాళ్ళు.

ఆయన యిల్లు చిన్నదేమీ కాదు. ఆ వూరి మొత్తంలో అలాటివి రెండు మూడు యిళ్ళకన్నా వుండవు. ఆ యింటిలో ఆయన్తోబాటు ఆడ, మగ యిద్దరు నౌకర్లున్నారు. వాళ్ళు భార్యా భర్తానూ. ఆయన్నే నమ్ముకుని ఆ యింట్లోనే వుంటున్నారు.

"దొడ్లో మోట బావి వుంది. పక్కనే బాత్ రూములున్నాయి. కాళ్ళు చేతులూ కడుక్కుని కాసేపు సేదతీర్చుకోండి" అన్నారాయన. అంచెలంచెలుగా జనం వెళ్ళి వస్తున్నారు. కాసేపట్లో ముప్పయి ప్లేట్లలో మినపరొట్టె, ఆవకాయతో సహా వాళ్ళ ముందుకొచ్చింది. ఆవురావురు మంటూ వున్నారేమో ఆరారగా ఆరగించారు. వెంటనే రెండేసి చక్రకేళీ పళ్ళు వాళ్ళ దగ్గిరికొచ్చాయి. అవీ ఆరగించారు వాళ్ళు. "కాసేప్పోయాక కాఫీ ఇస్తారు, తాగి హాల్లో పడుకోండి. పొద్దున్న మాట్లాడుకొందాం" అంటూ తన గదిలోకెళ్ళి తలుపేసుకున్నారు వెంకట్రామయ్యగారు.

* * *

ఇవేళ నిన్నయి, రేపు ఇవేళయింది. వెంకట్రామయ్య గారు స్నానాదులు ముగించుకొని వాళ్ళ ముందుకొచ్చారు. వాళ్ల చేతుల్లో మళ్ళీ ప్లేట్లు, వాటిల్లో ఇడ్లీ, కారప్పొడి, కొబ్బరి చెట్నీ వున్నాయి.

"మీ ఆతిథ్యాన్ని మేం ఎప్పటికీ మరచిపోలేం" అన్నాడు యశ్వంత్.

"ఇది ఆతిథ్యం కాదు, ఆత్మ సంతృప్తి" అన్నారాయన.

అంతా ఆయనకేసి చూశారు – "నాకిద్దరు కొడుకులు. పెద్దవాడు మిలట్రీలోకెళ్ళి చైనా యుద్ధంలో చనిపోయాడు. రెండోవాడు ఇంజనీరింగ్‌లో చదువుకు స్వస్తి చెప్పి అడవుల్లోకి వెళ్ళి పోయాడు - అడవుల్లో వుండే క్రూరమృగాలన్నీ మనుషుల రూపంలో నగరాల్లోకి వచ్చేశాయి కాబట్టి మనుషులు తమ ఆశయ సాధన కోసం అడవుల్లోకి వెళ్ళక తప్పదని వాడి సిద్ధాంతం. నేను కాదన్లేదు. పోలీసులు వాడ్ని వెంటాడి, వేటాడి చంపేశారు. పోలీసులకు, నక్సలైట్లకు జరిగిన ఎన్‌కౌంటర్లో చచ్చి పోయాడని పేపర్లో వేశారు"

"మీ అబ్బాయి పేరు - " ఆత్రంగా అడిగింది నిరీక్షణ.

"సునీల్ వర్మ"

"అతని పేరు మేం చాలాసార్లు విన్నాం"

"అతను మీ అబ్బాయా?"

"అవును నేను వాడి తండ్రిని"

కాసేపు ఎవరూ మాట్లాడ లేక పోయారు. ముసలాయన కంట్లోంచి ఒక్కనీటి బొట్టు కూడా రాలేదు. అవి ఎప్పుడో ఎండిపోయి వుండచ్చు - అనుకుంది నిరీక్షణ.

"వాడి రహస్య సమావేశాలు ఇక్కడే జరిగేవి... నిన్నంతా వాడి స్మృతులే నాకు"

అందరూ అదోలా అయిపోయారు - ముఖ్యంగా యశ్వంత్, నిరీక్షణ, ప్రతాప్.

"ఈ వూరేమిటండీ, మరీ దారుణంగా వుంది. తోటి మనిషిని నమ్మకుండా, మనిషి పుట్టించిన దేవుడ్ని నమ్ముతారేమిటి వీళ్ళు?"

టాపిక్ డైవర్ట్ చేయడానికి అడిగాడు ప్రతాప్.

"పదండిచెబుతాను" అంటూ లేచాడు ముసలాయన.

అనుసరించింది యువతరం.

"ఈ వూరే కాదు, మొత్తం దేశమంతా ఇలాగే వుంది. నేనో విషయం చెబుతాను, వింటారా!?"

ఎవరూ మాట్లాడలేదు. వెంకట్రామయ్య గారే మాట్లాడారు - "దేవుడున్నాడో లేడో! లేడని మీ కెంత నమ్మకమో, ఉన్నాడని వాళ్లకంతకన్నా గట్టి నమ్మకం. ఉన్నాడనుకోవడంలో వాళ్ళకేదో ఊరట కలుగుతోంది. దేవుడు అనేవాడు మనుషుల నెత్తి మీద స్వప్న కిరీటం. కలలోనే అది వుంటుంది. కానీ దేవుడు మీద వాళ్ళకున్న నమ్మకం - నిజానికి దేవుడి కన్నా గొప్పది. మీరంతా చదువుకున్న వాళ్ళు. నిజం చెప్పండి - ఇప్పుడు ఈ దేశంలో ప్రచారం చేయాల్సింది ముందుగా దేవుడు లేడనా? కాదు. అదుగో పొలంలో పని చేస్తున్న కుర్రాడ్ని చూడండి - వాడికి ఆరేళ్ళకన్నా వుండవు ఆ లేత చేతులు ఎంతెంత బరువు మోస్తున్నాయో తెలుసా? మంటల్లో కాలిపోయిన ఆపాదు బడిన కొంప చూడండి - ఆడ పిల్లలకు పెళ్ళిళ్ళు చేయలేక కొంప మొత్తం పాటు బెట్టుకున్నారు వాళ్ళు. ఈ వూర్లో వున్నది ఒకే ఒక్క నాటు వైద్యుడు. వాడికి వైద్యం తప్ప అన్నీ తెలుసు. కానీ, ఊరు మొత్తం వాడి మీదే ఆధారపడాలి. మరో వైద్యుడ్ని వాడు రానివ్వడు. ఈ గోల పడలేక ఈ వూరికి ఎవరూ రారు కూడా. దేవుడు లేడని ప్రచారం చేయడానికి ముందు ఆ విద్యను నాశనం చేయండి. వైద్య సదుపాయాల గురించి ఆలోచించండి. అన్యాయాన్ని, అక్రమాన్ని అరికట్టండి. నా మాటలు చేదు మాత్రలు కావచ్చు. కాని ఈ రుగ్మత పోవాలంటే తప్పదు మరి! అంతేకాదు - మీ ఉద్యమాన్ని ముందు పసిపిల్లల దగ్గర్నుంచి మొదలు పెట్టండి. వాళ్ళకు మీరంటే చాలా యిష్టం"

అందరూ ఒకర్నొకరు చూసుకుని, వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకున్నారు. చివరకు యశ్వంత్, ప్రతాప్, నిరీక్షణ కొంతకాలం పాటు ఆ వూర్లోనే వుండాలని నిర్ణయం తీసుకున్నారు. వెంకట్రామయ్య గారి సహాయ సహకారాలు ఎప్పుడూ వాళ్లకి వుంటాయని తెలుసు. ●